

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు.

- 8లో ▸



సమస్య పరిష్కరించండి

బీబీపేట హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన సమస్యను పరిష్కరించాలంటూ విద్యార్థులు రోడ్డెక్కారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /12.1

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రుల తనిఖీ



కామారెడ్డి టౌన్/భిక్కనూరు: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే మహిళలు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ మెటర్నిటీ అండ్ హెల్త్ న్యూట్రిషన్ (ఎంహెచ్‌ఎన్) రాష్ట్ర బృందం సభ్యులు సౌజన్య, ప్రమీల వైద్యులకు సూచించారు. సోమవారం వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, రాజీవ్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భిక్కనూరు ప్రభుత్వాస్పత్రులను సందర్శించారు. గర్భిణులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. మహిళలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించాలని సూచించారు. వారి వెంట జిల్లా ప్రో గ్రాం అధికారి అనురాధ, భిక్కనూరు ఆస్ప త్రి వైద్యురాలు దివ్య, ఎంపీహెచ్‌ఈవోలు వెంకటరమణ, సతీష్, నర్సింగ్ అధికారి చైతన్య ఉన్నారు.

నేడు జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్ష ఎన్నికలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్ష పదవికి మంగళవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. గతంలో మున్నూరు కాపు సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు దాదాపు ఏకగ్రీవంగా జరిగేవి. జిల్లా ఏర్పాటైన నాటి నుంచి కామారెడ్డికి చెందిన మామిండ్ల అంజయ్య అధ్యక్షుడిగా, పి.అంజయ్య ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ వస్తున్నారు. అయితే సంఘం జిల్లా అధ్యక్షుడికి రాజకీయాల్లోనూ ప్రాధాన్యత లభిస్తుండడంతో ఈసారి అధ్యక్ష పదవికి పోటీ ఏర్పడింది. జిల్లా కేంద్రానికి చెందిన ఆకుల శ్రీనివాస్‌రావ్‌తోపాటు కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన హన్మాల గంగయ్య ఈ పదవికి పోటీ పడుతున్నారు. సంఘం మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు జిల్లా అధ్యక్షుడి ఎన్నికలో ఓటు వేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పాత 23 మండలాల అధ్యక్ష, కార్యదర్శుల మద్దతు కోసం ఇరువురు అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో జరిగే ఎన్నికల ప్రక్రియ అనంతరం అధ్యక్షుడు ఎవరో తేలిపోనుంది.

నేడు విజయోత్సవాలు

కామారెడ్డి క్రైం: ప్రజాపాలన విజయోత్సవాలు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేపట్టడంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన అంతడుపుల నాగరాజు బృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ ఆర్టిజన్ల జేఏసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జాయింట్ కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గంగల స్వామి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కమిటీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా ప్రణీత్‌గౌడ్, కన్వీనర్‌గా శ్రీకాంత్‌యాదవ్, కోకన్వీనర్లుగా అశ్విన్, తిరుపతిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శివానంద్, కోశాధికారిగా స్వామి, సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రసాద్‌గౌడ్ ఎన్నికయ్యారు.

'వరి కొయ్యలను దహనం చేయొద్దు'

కామారెడ్డి అర్బన్: వరి పంట నూర్పిడి తర్వాత అవశేషాలను(వరి కొయ్యలు) తగలబెట్టవద్దని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. వరి కొయ్యలను తగలబెడితే భూమిలోని సేంద్రియ కర్బనం కార్బన్ డైఆక్సైడ్‌గా మారి పర్యావరణం కలుషితమవుతుందని పేర్కొన్నారు. పొలంలో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించి సమతుల్యత దెబ్బతింటుందని వివరించారు. వరి కొయ్యలను భూమిలోనే దున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులు దీనిని గమనించాలని సూచించారు.

పునర్విభజనపై ఆశలు!

- జిల్లాలో 2 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయని అంచనా
- అవకాశం కోసం నిరీక్షిస్తున్న అన్ని పార్టీల ద్వితీయ శ్రేణి నేతలు



నియోజకవర్గాల పునర్విభజనపై పలువురు నేతలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న నాలుగు నియోజకవర్గాలు.. పునర్విభజన తర్వాత ఆరవుతాయని భావిస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ప్రక్రియ పూర్తవుతుందని ఆశిస్తున్న నేతలు.. అదృష్టం కలిసొస్తే అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో ప్రస్తుతం కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన చేపడితే నియోజక వర్గాల సంఖ్య ఆరుకు పెరుగుతుందని ఆశావహులు లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధాన పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు పలువురు తమకు అవకాశం లభిస్తుందన్న ఆశతో ఉన్నారు. దీనికితోడు రాబోయే ఎన్నికల నాటికి చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్న నేపథ్యంలో రాజకీయాల్లో కొనసాగుతున్న మహిళా నాయకులతో పాటు కొందరు నాయకులు తమ కుటుంబ సభ్యులను రాజకీయాల్లో దింపేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు నాయకులు ఇప్పటినుంచే నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల గురించి లెక్కలు వేసుకుంటున్నారు. ఏ మండలం ఎటు పోతుంది, కొత్తగా ఏ నియోజక వర్గం ఏర్పాటవుతుంది, మహిళల జనాభా ఎక్కడ ఎక్కువగా ఉంది, మహిళలకు రిజర్వ్ అయ్యే నియోజకవర్గాలు ఏవీ అన్న అంశాలపై అంచనాలు వేస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై జిల్లావ్యాప్తంగా జోరుగా చర్చలు నడుస్తున్నాయి. కామారెడ్డి రెండు నియోజకవర్గాలుగా ఏర్పడుతుందని భావిస్తున్నారు. అలాగే ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజక వర్గాల రూపురేఖలు కొంతమారి నాలుగు నియోజక వర్గాలు అవుతాయని లెక్కలు వేస్తున్నారు. తద్వారా జిల్లాలో ప్రస్తుతం ఉన్న నాలుగు నియోజక వర్గాల సంఖ్య ఆరుకు చేరుతుందన్న అంచనాల్లో రాజకీయ నేతలు ఉన్నారు.

మార్పులపై సమాలోచనలు

జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నేతలు నియోజకవర్గాల పునర్విభజనతో తమకు అవకాశాలు దక్కుతాయన్న ఆశతో ఉన్నారు. జిల్లాలో జుక్కల్ నియోజక వర్గం దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వుడ్‌గా ఉంది. పునర్విభజన సమయంలో రిజర్వేషన్‌లో మార్పు వస్తుందని నేతలు భావిస్తున్నారు. జిల్లాలో ఓ నియోజక వర్గం ఎస్టీలకు రిజర్వ్ కావచ్చనే ప్రచారమూ జరుగుతోంది. కొందరు నేతలు అధికారులు, రిటైర్డ్ అధికారులను కలిసి నియోజకవర్గాల పునర్విభజన ఎలా జరుగుతుందని, ఏ ప్రాతిపదికన విభజిస్తారు, రిజర్వేషన్ ఎలా ఉండబోతోంది అన్న వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లో అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే ఇద్దరు ముగ్గురు ఆశావహులు ఉన్నారు. పునర్విభజనకు సంబంధించిన ప్రక్రియ మొదలైతే ఆశావహుల సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు.

మహిళా రిజర్వేషన్లు..

చట్టసభల్లో పోటీ చేయడానికి అవకాశాలు రాకపోవడంతో చాలా మంది మహిళలు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికలకే పరిమితమయ్యాయి. అయితే వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అమలయ్యే అవకాశాలు ఉండడంతో పలువురు మహిళల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే నియోజక వర్గాల పునర్విభజన తర్వాతే ఏ నియోజక వర్గం మహిళలకు రిజర్వ్ అవుతుందన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

వరికి బోనస్ ఘనత కాంగ్రెస్‌దే

- నారుమళ్ల కోసం నిజాంసాగర్ నీటిని విడుదల చేశాం
- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : వరి పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ అందించిన ఘనత కాంగ్రెస్ సారథ్యంలోని ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో 67,901 మంది రైతులనుంచి 4,98,226 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, కామారెడ్డి జిల్లాలో 30,640 మంది రైతుల వద్దనుంచి 2,10,724 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇప్పటికే గతేడాది కన్నా ఎక్కువ ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇప్పటికే చాలామంది రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు పడ్డాయన్నారు. దీంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రెండుమూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి అవుతాయని, చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లకు..

బాన్సువాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి మొదటి విడతలో రూ.8 కోట్లు పంపిణీ చేశామని పోచారం తెలిపారు. మిగతా వారికి త్వరలో బిల్లులు వస్తాయన్నారు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, నియోజకవర్గంలో మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. నారుమడులు వేయడానికి నిజాంసాగర్‌నుంచి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరున్నందున ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందేలా చూస్తామన్నారు. అనంతరం పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, నాగులగామ వెంకన్న, ఎజాస్, నర్సింలు, సందీప్, నర్సన్న, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

'చేప విత్తనోత్పత్తి కేంద్రానికి పూర్వవైభవం తెస్తాం'




ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: అచ్చంపేటలోని చేప విత్తనోత్పత్తి కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హామీ ఇచ్చారు. సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్చంపేట చేప విత్తనోత్పత్తి కేంద్రాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం వచ్చిన నిధులను బీఆర్‌ఎస్ నాయకులు దోచుకోవడం వల్ల నిరుపేదలు స్వయం ఉపాధికి దూరమయ్యారని ఆరోపించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వందశాతం సబ్సిడీపైన 24 లక్షల చేప పిల్లలను నిజాంసాగర్ ప్రాజెక్టులో వదులుతున్నామన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా అధ్యక్షుడు గాదం సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు రమేశ్ యాదవ్, శివరాజ్, ఆకాష్, కాశయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌సాయిలు, లక్ష్మయ్య, రాములురాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

- అతివేగం, అజాగ్రత్త, డ్రంకన్ డ్రైవ్‌లతో రోడ్డు ప్రమాదాలు
- పది నెలల్లో 450 రోడ్డు ప్రమాదాలు.. 241 మంది మృతి
- ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచిస్తున్న పోలీసులు



కామారెడ్డి క్రైం : వేగంగా వెళ్లినా వాహనాన్ని నియంత్రించగలనన్న అతి విశ్వాసం.. హెల్మెట్/సీట్ బెల్ట్ పెట్టుకోకుంటే ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యం.. ఎంత తాగినా స్టెడీగా బండి నడపగలనన్న నమ్మకం.. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదమని తెలిసినా వాహనదారులు చేస్తున్న తప్పిదాలతో జీవితాలు రోడ్డు పాలవుతున్నాయి. జిల్లాలో ఇటీవల జరిగిన పలు ప్రమాదాలను గమనిస్తే డ్రంకన్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఆయా అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ చేయని ప్రయత్నం లేదు. అయినా నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మృతుల్లో ఎక్కువగా యువకులే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

రోజుకో చోట..

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది అక్టోబర్ చివరినాటికి 450 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 241 మంది మృత్యువాత పడగా.. 412 మంది గాయాలపాలయ్యారు. ఎక్కడ ప్రమాదం జరిగినా దానికి అతివేగం, నిర్లక్ష్యం, డ్రంకన్ డ్రైవ్‌లే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. యువకులు, చిన్నపిల్లలు ఉన్న తండ్రులు, కుటుంబాలను పోషించే వారు రోడ్డు ప్రమాదాల్లో చనిపోవడం గానీ, తీవ్ర గాయాలపాలవడం గానీ జరిగినప్పుడు బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వైద్యం కోసం లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. మరికొందరికి లక్షలు ఖర్చు పెట్టినా ప్రాణాలు నిలవడం లేదు.

జాగ్రత్తలు పాటించాలి



రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ తరఫున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. డ్రంకన్ డ్రైవ్‌తో కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్నాం. ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలి. – చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

కొంప ముంచుతున్న డ్రంకన్ డ్రైవ్..

మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరం అనీ, చట్టరీత్యా నేరమనీ ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుంది. అన్ని ఠాణాల పరిధిలో నిత్యం డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు. పట్టుబడిన వారికి జరిమానాలతో పాటు ఒకటి నుంచి రెండు రోజుల జైలు శిక్షలు కూడా పడుతున్నాయి. అయినా డ్రంకన్ డ్రైవ్ విషయంలో వాహనదారుల్లో మార్పు రావడం లేదు. ఇటీవలి కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల ఘటనలు చూస్తే మద్యం సేవించి వాహనాలు నడిపిన ఘటనలే ఎక్కువ. ముఖ్యంగా యువత చెడు వ్యసనాల బారిన పడుతున్నట్లు తెలుస్తుంది. కొందరు గంజాయి, మద్యం, కల్తీ కల్లు లాంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. ఇలాంటి చెడు వ్యసనాల కారణంగా మత్తులో ఉన్నప్పుడు వాహనాలు నడిపిస్తూ ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు సైతం అనేకం. అందుకే ఇటీవల జిల్లా పోలీసులు పాఠశాల కళాశాల స్థాయి నుంచే రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వాహనదారులు, ముఖ్యంగా యువత వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు అంటున్నారు.

నిజామాబాద్ మేయర్ భర్తపై దాడి

- తీవ్రంగా గాయపడ్డ దండు చంద్రశేఖర్
- ఆస్పత్రికి తరలించిన స్థానికులు
- తన భూమి కబ్జా చేయడంతోనే దాడి చేశానన్న నిందితుడు
- వీడియో విడుదల



మేయర్ భర్త చంద్రశేఖర్‌పై దాడి చేస్తున్న దృశ్యం



చంద్రశేఖర్‌కు సపర్యలు చేస్తున్న స్థానికులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

ఖలీల్‌వాడి : నగర మేయర్ దండు నీతూ కిరణ్ భర్త బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ దండు చంద్రశేఖర్ అలియాస్ శేఖర్‌పై దాడి జరిగింది. సోమవారం సాయంత్రం పదో డివిజన్‌లోని ఓ వాటర్ ప్లాంట్ వద్ద 80 క్వార్టర్స్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ రసూల్ అలియాస్ శుక్రు దాడి చేశాడు. ఆయన దగ్గరకు నడుచుకుంటూ వచ్చిన రసూల్ రాగానే దాడి చేశాడు. దీంతో శేఖర్ కింద పడిపోయాడు. పక్కనే ఉన్న వారు అడ్డుకోడానికి యత్నించగా రసూల్ వారిని బెదిరించాడు. అనంతరం ఆటోలో నుంచి సుత్తి తీసుకొని వచ్చి దానితో దండు శేఖర్‌ను కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయనను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

దాడి వీడియో వైరల్

దాడి చేయడానికి రసూల్ ముందుగానే ప్రణాళిక వేసుకున్నట్లు తెలుస్తోంది. దాడి చేయడానికి వెళ్లే సమయంలో వీడియో తీసేందుకు వ్యక్తిని ముందుగానే సిద్ధం చేసుకున్నాడు. దండు శేఖర్ అనుచరులు భూ వివాదంలో ఇబ్బందులకు గురి చేయడంతో దాడికి పాల్పడ్డారనే అభిప్రాయాలు ఉన్నాయి. మేయర్ భర్త శేఖర్‌పై జరిగిన దాడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్థానికంగా వంద గజాల ప్లాట్ వివాదంలో ఈ దాడి జరిగినట్లు తెలిసింది.

డబ్బులు డిమాండ్ చేయడంతో..

దాడి అనంతరం నిందితుడు రసూల్ వీడియో విడుదల చేశాడు. దండు శేఖర్ అనుచరులు గోపాల్ తోపాటు మరి కొంత మంది తన భూమి కబ్జా చేశారని పేర్కొన్నాడు. మూడేళ్ల నుంచి వారు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రూ.రెండు లక్షల డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించాడు. ఎన్నోసార్లు శేఖర్‌ను కలిసి తన భూమి అప్పగించాలని అడిగినా ఆయన ఒప్పుకోకపోవడంతో దాడి చేశానని చెప్పారు. గత 15 ఏళ్లుగా తాను కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నాని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు సాయం చేయాలని కోరాడు.

నాలుగు బృందాలతో గాలిస్తున్నాం

- ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి : మేయర్ భర్త దండు శేఖర్‌పై దాడి చేసిన వ్యక్తిని పట్టుకోవడానికి నాలుగు బృందాలు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన మాట్లాడారు. భూ వివాదం నేపథ్యంలో రసూల్ దాడి చేశాడని చెప్పారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. దాడి వెనుక ఎవరి హస్తమైనా ఉందా అన్న కోణంలో ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తను, సహకరించాలని వీడియో రిలీజ్ చేయడంపై విలేకరులు అడగ్గా అలాంటిది ఏమి లేదని ఏసీపీ చెప్పారు. నిందితుడు ఆటో డ్రైవర్‌గా, బౌన్సర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. శేఖర్ ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

ప్రశాంతంగా 'గ్రూప్- 3'



జిల్లా కేంద్రంలోని జీవదాన్ స్కూల్ సెంటర్ వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పేపర్–3కి మొత్తం 8,268 మంది అభ్యర్థులకుగాను 4,612 మందే హాజరయ్యారు. హాజరు శాతం 55.78గా నమోదయ్యింది. ఆదివారం జరిగిన మొదటి పేపర్‌కు 4,655 మంది, రెండో పేపర్‌కు 4,644 మంది హాజరైన విషయం తెలిసిందే.. పరీక్ష సందర్భంగా జిల్లా కేంద్రంలోని 20 పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రశాంతంగా పరీక్షలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. – కామారెడ్డి టౌన్



పరీక్షా కేంద్రం వద్ద మనవరాలిని ఆడిస్తున్న గాంధారికి చెందిన గంగవ్వ



ఆర్‌కే డిగ్రీ కళాశాల వద్ద..

క్లుప్తంగా

20న అండర్-14 జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ ఎంపికలు

కామారెడ్డి రూరల్: గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20న జిల్లా స్థాయి అండర్ -14 విభాగంలో బాలబాలికలకు ఎంపికలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హీరాలాల్ సోమవారం తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలను మాత్రమే తీసుకురావాలని తీసుకురావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు గర్గుల్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సోముల మధుసూదన్‌రెడ్డిని 9494259901 ద్వారా సంప్రదించాలని సూచించారు.

సెపక్ తక్రా పోటీల్లో జాతీయస్థాయికి ఎంపిక



కామారెడ్డి అర్బన్: మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని కోచ్ నరేష్ తెలిపారు. స్థానిక సాందీపని కళాశాల విద్యార్థి బత్తుల రష్మిత్, బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి అక్షయ్‌లు ఎంపికయ్యారు. మణిపూర్‌లో వచ్చే డిసెంబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని కోచ్ నరేష్ పేర్కొన్నారు.

జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో ఇద్దరికి వెండి పతకాలు



కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన రెండో జాతీయ స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ ప్రొ యోగాసన లీగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు వెండి పతకాలు సాధించారు. 21–26 ఏళ్లలోపు విభాగంలో ఉప్పల్‌వాయికి చెందిన నాయిని నివాస్, 27–30 ఏళ్లలోపు విభాగంలో పెద్దఎగిడికి చెందిన తుల్జాపూర్ హన్మంతు వెండి పతకాలు పొందారు. వచ్చే సంవత్సరం మే నెలలో నిర్వహించే అంతర్జాతీయ స్థాయి ప్రొ యోగాసన లీగ్ పోటీలకు వీరు ఎంపికయ్యారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

- అదనపు కలెక్టర్ విక్టర్
- ప్రజావాణికి 66 వినతులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 66 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులు తమ పరిధిలో లేకుంటే పరిష్కార మార్గాలు చూపాలన్నారు. లేదంటే ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. జెడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు లేవు



ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కనీస సౌకర్యాలు లేవని లబ్ధిదారులు వాపోయారు. భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. మొత్తం 52 ఇళ్లకు గాను 36 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయగా ఏడాది కాలంగా వాటిలోనే నివాసం ఉంటున్నామని తెలిపారు. స్థానిక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

బీడీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని వినతి



బీడీ కార్మికుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి కార్మికుల పొట్టగొడుతున్న దేశాయి బీడీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక్కో కార్మికుడి నుంచి ప్రతి నెలా వెయ్యి బీడీలతోపాటు ప్రతి వెయ్యి బీడీలకు రూ.10 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా ప్రతి నెలా జిల్లాలోని బీడీ కార్మికుల నుంచి రూ.20 లక్షల చొప్పున దండుకుంటున్నారని ఆరోపించారు. ఆ బీడీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి



గ్రామంలో చేపడుతున్న ఓ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన బత్తిని రాజు, ఆయన కుటుంబ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. తమ ఇంటి పక్కన ఉండే సమీప బంధువు నర్సింలు జీపీ అనమతి లేకుండానే ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని తెలిపారు. అందులో కొంత మేరకు తమ స్థలాన్ని కూడా కబ్జా చేశారన్నారు. జీపీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



సభలో అభివాదం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: భవన నిర్మాణ రంగాల కార్మికులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల అయిలన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా నాల్గవ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్స్యూ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి జీవిత కాలం లేబర్ కార్డు కొనసాగించాలని, పనిముట్ల కొనుగోలుకు ప్రతి కార్మికునికి రూ. 10 లక్షల రుణాలు, 50 ఏళ్లు నిండిన వారికి రూ.5 వేల పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా పయ్యావుల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ఐదు మొరం టిప్పర్లు సీజ్

సాక్షి ఎఫెక్ట్..




బాన్సువాడ : 'మాయమవుతున్న గుట్టలు' శీర్షికన ఈనెల 14న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్ స్పందించారు. సోమేశ్వర్ గుట్ట నుంచి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ఐదు టిప్పర్లతోపాటు జేసీబీని సోమవారం ఆయన సీజ్ చేశారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాల్టా చట్టం ప్రకారం మట్టి, మొరం తవ్వకాలకు తప్పనిసరిగా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

కామారెడ్డి క్రైం: బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై విచారణ జరిపామని మైనింగ్ శాఖ ఏడీ నగేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ తహసీల్దార్, ఆర్ఐలతో విచారణ జరిపించిన సమయంలో ఆయా ప్రదేశాల్లో ఎలాంటి తవ్వకాలు జరగడం లేదని పేర్కొన్నారు. మూడు మండలాల పరిధిలో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామని తెలిపారు.

తప్పుడు రక్త పరీక్ష రిపోర్టులు

- ఆందోళనలకు గురైన బంధువులు
- జిల్లా కేంద్రంలో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఘటన



కామారెడ్డిలో చేసిన రక్త పరీక్షల ఫలితాలు



హైదరాబాద్‌లో చేసిన రక్త పరీక్షల ఫలితాలు

కామారెడ్డి టౌన్: ఓ ప్రైవేట్ ఆస్పత్రికి గుండె నొప్పితో వచ్చిన ఓ వృద్ధుడికి వైద్యులు పరీక్షలు నిర్వహించి తప్పుడు రక్తపరీక్షల ఫలితాలు ఇచ్చి బంధువులకు ముచ్చెమటలు పట్టించిన ఘటన ఆదివారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన ప్రకారం వివరాలు.. పట్టణానికి చెందిన 58 ఏళ్ల ఇసామోయిద్దిన్‌కు ఆదివారం అర్ధరాత్రి గుండెలో నొప్పి రావడంతో బంధువులు జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి ఎదురుగా గల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు 2డీ- ఈకో స్కానింగ్‌తో పాటు, రక్తపరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలను చూసిన వైద్యులు ఆయనకు సీరియస్‌గా ఉందని అడ్మిట్ చేసుకోవాలని సూచించడంతో బంధువులు ఒక్క సారిగా ఆందోళనకు గురయ్యారు. ఇసామోయిద్దిన్‌కు కొంత కాలం క్రితం గుండె ఆపరేషన్ జరిగింది. రెగ్యులర్‌గా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వైద్యుడి సూచన మేరకు హడావుడిగా ఆదివారం అర్ధరాత్రి కామారెడ్డి నుంచి రాజధానికి వెళ్లి ఆయనను కలిశారు. అక్కడి వైద్యులు రక్త పరీక్షలు చేసి.. ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలపడంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. కామారెడ్డిలో వైద్యం పేరిట డబ్బులు దండుకోవాలనే ఉద్దేశంతో తప్పుడు ఫలితాలు ఇచ్చి భయపెట్టారని ఇసామోద్దిన్ బంధువులు ఆరోపించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్



తాడ్వాయిలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు



రాజంపేట ప్రజావాణిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని ఇన్‌చార్జి తహసీల్దార్ రేఖ తెలిపారు. గ్రామాలలో ఏమైనా సమస్యలుంటే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రేఖ, ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఏవో నర్సింలు, సూపర్‌వైజర్ శివలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో ..

రాజంపేట: స్థానిక తహసీల్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సామాజిక ఆర్థిక సర్వే, వరి కొనుగోళ్లు, ఓటరు జాబితాలపై మండల అధికారులతో అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి.విక్టర్ రివ్యూ నిర్వహించినట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



దోమకొండ: ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, దాని కోసం ప్రతి కళాశాలలో ఉదయం సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. అధ్యాపకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు ఉన్నారు.

రెండు నెమళ్ల కళేబరాలు స్వాధీనం



నవీపేట: మండలంలోని కమలాపూర్ శివారులో సోమవారం రెండు నెమళ్ల కళేబరాలు ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుధీర్, సెక్షన్ ఆఫీసర్ జెహ్రా వచ్చి నెమళ్ల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు. వేటగాడిగా అనుమానిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నెమళ్లను చంపాడా? లేక పోతే ప్రమాదవశాత్తు చనిపోయాయా? అనేకోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. నెమళ్ల కళేబరాలకు పోస్టుమార్టం పూర్తయిన తరువాత పూర్తి వివరలు వెల్లడిస్తామని ఫారెస్ట్ అధికారులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి



బాల్కొండ: మండల కేంద్రంలో వీధి కుక్కలు సోమవారం స్వైర విహారం చేశాయి. కుక్కల దాడిలో మండల కేంద్రానికి చెందిన ముస్కాన్, ఆదిత్యకు గాయాలయ్యాయి. మండల కేంద్రంలో కుక్కలు బెడద నివారణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గాయాలపాలైన చిన్నారులకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

రెండేళ్ల చిన్నారిపై కోతులు..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన రెండేళ్ల చిన్నారి ఫైమా బేగంపై సోమవారం కోతులు దాడులు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లో ఆడుకుంటున్న చిన్నారిపై కోతులు దాడి చేయడంతో తొడకు గాయమైంది. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోడంతో కోతులు వెళ్లిపోయాయి. కోతుల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లోని తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. తాజుద్దీన్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం వ్యక్తిగత పనులపై కామారెడ్డికి వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం ధ్వంసం చేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. బీరువాలో నుంచి 10 తులాల బంగారం, రూ.లక్ష నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

రెంజల్(బోధన్): గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ మండలం ఊట్‌పల్లికి చెందిన బదావత్ శివ(34) కొంతకాలంగా అత్తగారి గ్రామమైన వీరన్నగుట్టతండాలో ఉంటున్నాడు. తొమ్మిది నెలలుగా మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ఆదివారం ఉదయం కూలీ పనికి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన శివ గడ్డి మందు తాగి రెంజల్ గ్రామ శివారులో పడిఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శివను 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

ఎడపల్లి (బోధన్): మండలంలోని దుబ్బ తండాకు చెంది వివాహిత ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. భర్త ఇటీవల మృతి చెందగా, పిల్లలతో కలిసి సదరు మహిళ ఉంటోంది. సోమవారం ఉదయం నుంచి పిల్లలతోపాటు తల్లికనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంచిప్ప శివారులో ఎలుగుబంటి సంచారం

మోపాల్: మండలంలోని మంచిప్ప పెద్ద చెరువు తూము వద్ద ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు ఎలుగుబంటిని చూసి భయాందోళనకు గురయ్యారు. ఏడాది కాలంగా ఎలుగుబంటి సంచరిస్తోందని అటవీశాఖ అధికారులకు తెలుపుతున్నా వారు పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారులు స్పందించి ఎలుగుబంటిని బంధించి దూర ప్రాంతంలో వదిలేయాలని కోరుతున్నారు. ఈ విషయమై బీట్ ఆఫీసర్ సురేశ్‌ను వివరణ కోరగా.. రైతులు జాగ్రత్తగా ఉండాలని, మంగళవారం ఎలుగుబంటి సంచారం ఆనవాళ్లను సేకరిస్తామన్నారు.

పతంగి కోసం వెళ్తే ప్రాణాలు పోయాయి

- చెట్టెక్కి పతంగి తీస్తుండగా విద్యుత్‌షాక్
- 12 ఏళ్ల బాలుడు మృతి
- కుర్నాపల్లిలో ఘటన



షేక్ మతీన్ (ఫైల్)



ఘటనాస్థలంలో షేక్ మతీన్ మృతదేహం

ఎడపల్లి (బోధన్): చెట్టుకు వేలాడుతున్న పతంగిని తీసేందుకు ప్రయత్నించిన బాలుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటన మండలంలోని కుర్నాపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కుర్నాపల్లి గ్రామానికి చెందిన షేక్ మతీన్ (12) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5వతరగతి చదువుతున్నాడు. సోమవారం మంగళ్‌పాడ్‌లోని హెయిర్ సెలూన్‌లో కటింగ్ చేయించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా, రోడ్డు పక్కన చెట్టుకు గాలిపటం వేలాడుతూ కనిపించింది. మతిన్ దానిని తీసేందుకు ఒక ఇనుప రాడ్ పట్టుకొని చెట్టెక్కాడు. గాలిపటాన్ని తీస్తున్న క్రమంలో ఆ రాడ్డు విద్యుత్ తీగలపై పడి చెట్టుపైనే ప్రాణాలు వదిలాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగింపజేయడంలో లైన్‌మెన్ జగదీశ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిని వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న సబ్ ఇంజినీర్ జావిద్ బాధిత కుటుంబ సభ్యులతో, గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి విద్యుత్‌శాఖ నుంచి నష్ట పరిహారం అందేలా చూస్తానని చెప్పగా, పోలీసులు సైతం వారిని సముదాయించడంతో చివరకు మృతదేహాన్ని చెట్టుపైనుంచి కిందికి దింపారు. మృతుడి తల్లి సాహీదాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొడుకు ప్రాణాల కోసం తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

- గులియన్ – బారే సిండ్రోమ్ బారిన పడిన బాలుడు
- హైదరాబాద్‌లోని రెయిన్‌బోలో చికిత్స
- రూ.40లక్షలు ఖర్చు చేసినా నయంకాని జబ్బు
- ప్రభుత్వం, దాతల సహకారం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు



రెయిన్‌బోలో చికిత్స పొందుతున్న శ్రేయాన్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బెజుగం ప్రసాద్ అనే వ్యక్తి కుమారుడు శ్రేయాన్ (11) ప్రపంచంలోనే అరుదుగా వచ్చే గులియన్ – బారే సిండ్రోమ్ బారినపడ్డాడు. జూన్‌లో శ్రేయాన్‌ను హైదరాబాద్‌లోని రెయిన్‌బో పిల్లల ఆసుపత్రిలో చేర్పించగా, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. చికిత్సకోసం బాలుడి తల్లిదండ్రులు ఇప్పటి వరకు రూ.40 లక్షలు ఖర్చు చేశారు. అయినప్పటికీ నయం కాకపోగా బాలుడి ఆరోగ్యం మరింత క్షీణిస్తోంది. ఇంకా ఎంత ఖర్చవుతుందో తెలియన పరిస్థితి ఉండగా, చేతిలో డబ్బులు లేక ఆ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి తమ కుమారుడి ప్రాణాలను కాపాడాలని వేడుకుంటున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి 94939 32777 నంబర్ ద్వారా సాయం చేయాలని కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి ట్రాఫిక్ సీఐ వీరయ్య సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారందరినీ మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ అహ్మద్ మోయినొద్దీన్ తొమ్మిది మందికి రూ. 21,500 జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధించారు.

ధాన్యం లారీ బోల్తా.. మహిళకు తీవ్ర గాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో సోమవారం ధాన్యం లారీ బోల్తా పడడంతో మహిళకు తీవ్ర గాయాలైనట్లు ఏఎస్సై ప్రకాశ్‌నాయక్ తెలిపారు. ధాన్యం లోడ్‌తో బాన్సువాడ డివిజన్‌లోని దుర్కి గ్రామానికి వెళ్తుండగా పెద్దవాగు మూలమలుపు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా లారీ బోల్తాపడింది. రోడ్డు పక్కన నిలబడి ఉన్న అయిలాపూర్ గ్రామానికి చెందిన మిద్దె మౌనికపై ధాన్యం బస్తాలు పడడంతో తీవ్ర గాయాలైనట్లు ఏఎస్సై తెలిపారు. మౌనిక తనతోపాటు ఉన్న కూతురిని పక్కకు నెట్టివేయడంతో పాప ప్రమాదం నుంచి బయటపడింది. గాయాలైన మౌనికను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. ఘటనాస్థలాన్ని సహకార సంఘం సీఈవో పెంటయ్య పరిశీలించారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

ఖలీల్‌వాడి: కరెంట్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో నగరంలోని ధర్మపురిహిల్స్‌కి చెందిన మహ్మద్ అయాన్ ఖాన్ (23) ఇంటి వద్ద కూలర్ రిపేర్ చేసే క్రమంలో షాక్ తగిలింది. అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండాపూర్‌లో ఆవు..

రాజంపేట: విద్యుత్ షాక్ తగిలి జెర్సీ ఆవు మృతి చెందిన ఘటన రాజంపేట మండలం కొండాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంగళి అభిలాష్ వ్యవసాయ పనులు చేసుకుంటూ రెండు జెర్సీ ఆవులను పోషిస్తున్నాడు. సోమవారం మేతకోసం వెళ్లిన ఆవులు ఎస్ఎస్‌టీ 20 ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాయి. సుమారు రూ.లక్షా 10 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

శిలాఫలకం ధ్వంసం



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్‌లో బీఆర్ఎస్ హయాంలో వేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రూ.60 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు గతేడాది సెప్టెంబర్ 22న వేసిన శిలాఫలకం ధ్వంసమైంది. ఆదివారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు కొంత మంది యువకులు ఇక్కడ బర్త్ డే వేడుకలు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మద్యం మత్తులో శిలాఫలకాన్ని ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు ఎస్సై అనిల్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోంలోన్ పేరుతో సైబర్ మోసం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తక్కువ వడ్డీకే హోంలోన్ ఇప్పిస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటన ఇచ్చిన సైబర్‌నేరగాళ్లు మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన వ్యక్తిని నమ్మించి మోసం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో ఇంటినిర్మాణం చేపడుతున్న చౌన్పోళ్ల మధుసూదన్ అనే వ్యక్తికి ఫేస్‌బుక్‌లో ఓ యాడ్ కనిపించింది. తక్కువ వడ్డీకి రుణం ఇప్పిస్తామని, కింది నంబర్‌ను సంప్రదించాలని దానిలో ఉంది. మధుసూదన్ ఆ నంబర్‌కు కాల్‌చేయగా, అవతలి వ్యక్తి ఆయనను నమ్మించాడు. రుణం పొందాలంటే ముందుకు రూ.3,500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని సూచించగా మధుసూదన్ ఫోన్ పే చేశాడు. ఆ తరువాత సైబర్ నేరగాడు రూ.10వేలు అడగగా మళ్లీ పంపించాడు. అవతలి వ్యక్తి రూ.5లక్షల 40వేల హోం లోన్ వస్తుందని నమ్మిస్తుండడంతో 15 రోజుల వ్యవధిలో మధుసూదన్ మొత్తం రూ.70,250 చెల్లించాడు. ఆ తరువాత లోన్ విషయమై ప్రశ్నించగా, మరో రూ.12,500 చెల్లించి హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో ప్రాసెస్ పూర్తి చేసుకోవాలని సూచించడంతో అనుమానంతో స్నేహితులు, పోలీసులకు సమాచారం అందించాడు. చివరకు తాను మోసపోయినట్లు గ్రహించి లబోదిబోమన్నాడు. బాధితుడు సోమవారం సదాశివనగర్ పోలీసుకుల ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్ ప్రజలకు సూచించారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

కమ్మర్‌పల్లి: మండలం హాసాకొత్తూర్‌లో 9 రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసులో నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్సై జి అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మిట్టపల్లి లక్ష్మణ్ తాను దొంగిలించిన బంగారం, డబ్బుతో జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో కారు కొనుగోలు చేసేందుకు వెళ్తూ సోమవారం కమ్మర్‌పల్లి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా పోలీసులకు కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఈ నెల 9వ తేదీన హాసాకొత్తూర్‌లోని నాయిని పురుషోత్తం ఇంట్లో చోరీకి పాల్పడడంతోపాటు ముప్కాల్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.1.80 లక్షల నగదు, రెండు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. చోరీ కేసును ఛేదించడంలో సహకరించిన సీసీఎస్ పోలీసులు, స్థానిక సిబ్బందిని భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్ అభినందించారు.